క్లుప్తంగా

నేడు తాడేపల్లిలో ధర్నాను జయప్రదం చేయాలి

ఒంగోలు సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్ట్ లెక్చరర్లు ఈ నెల 11వ తేదీ తాడేపల్లిలోని రాష్ట్ర ఇంటర్మీడియట్ కమిషనరేట్ వద్ద నిర్వహించే ధర్నాకు జిల్లాలోని కాంట్రాక్ట్ లెక్చరర్లు హాజరై జయప్రదం చేయాలని రాష్ట్ర నాయకులు డాక్టర్ ఏసుపోగు జాన్‌బాబు, ఓ ఖాదర్‌వలి, ఆనందరావు, కాశీరత్నం కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని కోరారు.

వృద్ధులకు చీరల పంపిణీ

ఒంగోలు సబర్బన్: స్థానిక వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బీజేపీ నాయకులు ఆదివారం చీరలు పంపిణీ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సెగ్గెం శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు శివారెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు. తొలుత బీజేపీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

ఆర్థిక సాయం అందజేత

కనిగిరిరూరల్: మోడల్ స్కూల్ విద్యార్థి కుటుంబానికి ఎస్ఎస్ఎంసీ కమిటీ సభ్యులు రూ.5వేల ఆర్థిక సాయం ఆదివారం అందచేశారు. మోడల్ స్కూల్ ఎస్ఎంసీ కమిటీ సభ్యుడు, ఏడో తరగతి విద్యార్థి వికిల్ తండ్రి యు నాగేంద్రబాబు అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందారు. విద్యార్థి కుటుంబాన్ని మోడల్ స్కూల్ ఎస్ఎంసీ కమిటీ సభ్యులు పరామర్శించి చిరు సాయాన్ని అందచేశారు. ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ పందిటి మోహన్, బోస్, సత్యం, జెర్మియా, సురేష్, బొడ్డు వేణుగోపాల్ పాల్గొన్నారు.

250 మందికి వైద్య పరీక్షలు

టంగుటూరు: మండలంలోని పొందూరు గ్రామంలో పమిడి కోటయ్య వెంకట శేషమ్మ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఎయిమ్స్ హాస్పిటల్ వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించంచారు. శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు వైద్యులు రమణారెడ్డి, రామ లింగేశ్వరరావు, కార్తీక్, నిరజ తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు కాట్రగడ్డ రమేషబాబు, ప్రధానోపాధ్యయుడు యాతం శ్రీనివాస్, పమిడి ప్రసాద్, గ్రామ సర్పంచ్ కోటిలింగం, ఎంపీటీసీ నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ బలరాం, గ్రామ పెద్దలు ఏరువ అనందరావు, శివరామకృష్ణ, మాజీ సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు, కొల్లూరి సుధాకర్ పాల్గొన్నారు.

తీరిన ఓల్టేజీ సమస్య

కొండపి: మండలంలోని పెట్లూరు సబ్‌స్టేషన్ పరిధిలో చాలా కాలంగా ఓఎల్‌టీసీ మరమ్మతులకు గురైంది. మరమ్మతులకు గురైన ఓఎల్‌టీసీ ఆదివారం ఉదయం 9:30 గంటల నుంచి టీఆర్ఈ ఏఈ ఆధ్వర్యంలో కంపెనీ సిబ్బంది మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ పెట్లూరు సబ్‌స్టేషన్‌లోని ఓఎల్‌టీసీ కొన్ని నెలలుగా మరమ్మతులకు గురవడంతో సబ్‌స్టేషన్ పరిధిలోని కొన్ని గ్రామాలకు కొండపి సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. అందువల్లే లో ఓల్టేజీ సమస్య తలెత్తిందన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేశామన్నారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ

లింగసముద్రం: పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం వలన రక్తహీనత నివారించి పౌష్టికాహార లోపం దరిచేరనీయకుండా చేసి సంగ్రహణ శక్తి పెంచుతుందని ప్రాథమిక వైద్యాధికారిణి డాక్టర్ విద్యావతి అన్నారు. ఆదివారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ మండల పరిధిలోని 45 అంగన్‌వాడీ కేంద్రాలు, 46 ప్రభుత్వ పాఠశాలలు, 5 ప్రైవేట్ పాఠశాలల్లో ఈ నెల 12న జరుగు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో 1450 మంది చిన్నారులకు, పాఠశాలల్లో 4374 మంది విద్యార్థులకు సిబ్బంది ద్వారా 1 సంవత్సరం నుంచి 19 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ ఆల్బెండోజోల్ మాత్రలు మింగిస్తారని చెప్పారు. తల్లిదండ్రులు 12వ తేదీన పిల్లలను తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు హాజరయ్యేటట్లు చూడాలన్నారు. 12వ తేదీ హాజరు కాని పిల్లలకు ఈ నెల 20న మాత్రలు పంపిణీ చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జి.శ్రీనివాసులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ చెప్పినా.. చేసేది లేదు..!



సబ్ డివిజన్ చేయాలని కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న కొత్తపట్నం ప్రజలు (ఫైల్)



దేవాలయాల భూముల సబ్ డివిజన్ కోసం కొలతలు వేస్తున్న సర్వేయర్, దేవదాయ శాఖ ఈవో సుబ్రహ్మణ్యం

- కొత్తపట్నం రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం
- సబ్ డివిజన్ చేయమని కలెక్టర్ ఆదేశించినా పట్టించుకోని వైనం
- అవినీతి వనరుగా సర్వే నంబర్ 1,429 ఏ, బీ
- కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న ప్రజలు

కొత్తపట్నం: సబ్ డివిజన్ చేస్తే మాకేం వస్తుంది.. చేయకుండా అలాగే ఉంచి అవసరమైన వారికి తహసీల్దార్ కార్యాలయం నుంచి లెటర్లు ఇస్తుంటేనే ఎంతో కొంత డబ్బు వస్తుందనే ఆలోచనలో కొత్తపట్నం రెవెన్యూ అధికారులు ఉన్నారు. కింది స్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి అధికారుల వరకూ సర్వే నంబర్ 1,429 ఏ, బీ అంశాన్ని అడ్డంపెట్టుకుని అవినీతికి పాల్పడుతున్నారు. కలెక్టర్ చెప్పినా సబ్ డివిజన్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సబ్ డివిజన్ చేయకపోవడం వలన పదేళ్లుగా కొత్తపట్నం ప్రజలు అవస్థపడుతున్నారు. చివరకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ స్పందించి సబ్ డివిజన్ చేసి సమస్య పరిష్కరించాలని కొత్తపట్నం రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కానీ, సబ్ డివిజన్ చేయకపోవడం వలన ప్రజల ఇబ్బందులు, వారి అవసరాలను ఆసరాగా చేసుకుని అవినీతికి పాల్పడటానికి అలవాటుపడిన రెవెన్యూ అధికారులు.. కలెక్టర్ ఆదేశాలను సైతం పక్కన పెట్టేశారు.

మేము లెటరిస్తేనే మీకు రిజిస్ట్రేషన్..!

కొత్తపట్నం గ్రామంలోని సర్వే నంబర్ 1429 ఏ, బీలో కలుపుకుని 83.64 ఎకరాల గ్రామ కంఠం భూమి ఉంది. సుమారు వంద సంవత్సరాల నుంచి ఆ భూమికి సంబంధించి రిజిస్ట్రేషన్లు, క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. అయితే, 83.64 ఎకరాల స్థలం దేవదాయశాఖకు చెందినదిగా పదేళ్ల క్రితం ఆన్‌లైన్‌లో నమోదైంది. దీంతో అప్పటి నుంచి రిజిస్ట్రేషన్లు చేయడం లేదు. బ్యాంక్‌ల నుంచి మార్ట్‌గేజ్ లోన్లు, క్రయవిక్రయాలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేక సార్లు కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లారు. కలెక్టర్ చెప్పినప్పటికీ అధికారులు మాత్రం కాలయాపన చేస్తున్నారు. ఒక స్థలాన్ని కొనుగోలు చేస్తే లక్షలు చేతులు మారుతున్నాయని, రిజిస్ట్రేషన్ చేయాలంటే తాము లెటర్ ఇస్తేనే అవుతుందంటూ ప్రజల అవసరాలను ఆసరా చేసుకుని రెవెన్యూ అధికారులు దండుకుంటున్నారు. డబ్బులిచ్చిన వారికే లెటర్లు ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.



కొత్తపట్నం తహసీల్దార్ కార్యాలయం

తమ భూమి 1.26 ఎకరాలేనని దేవదాయ శాఖ తేల్చినా నిర్లక్ష్యం...

కలెక్టర్ ఆదేశాల అనంతరం దేవదాయశాఖ ఈవో సుబ్రహ్మణ్యం రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి కొత్తపట్నంలో రాజగోపాలస్వామి ఆలయానికి 36 సెంట్లు, ఆదికేశవస్వామి దేవస్థానానికి 20 సెంట్లు, నాగేశ్వరస్వామి ఆలయానికి 70 సెంట్లు స్థలం మాత్రమే ఉందని, 83.64 ఎకరాలు కాదని తేల్చారు. దగ్గరుండి మరీ కొలతలు కొలిపించుకుని ఆ మూడు దేవాలయాల స్థలాలను సబ్ డివిజన్ చేయించుకుని వెళ్లారు. అయితే, రెవెన్యూ అధికారులు మాత్రం 83.64 ఎకరాల భూమిని దేవదాయశాఖ జాబితాలో నుంచి తొలగించకుండా, సబ్ డివిజన్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజలను ఇబ్బందిపెడుతున్నారు. కలెక్టర్ చెప్పినా ఎందుకు చేయడం లేదని ప్రజలు ప్రశ్నిస్తే కుంటిసాకులు చెబుతున్నారు. దీంతో బాధిత ప్రజలు మళ్లీ ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

> **త్వరలోనే సబ్ డివిజన్ చేయిస్తా**
>
> రెవెన్యూ అధికారులు, సిబ్బంది ప్రస్తుతం ఆలూరులో రీ సర్వే, కొత్తపట్నం, అల్లూరు రెవెన్యూ పరిధిలో రీ సర్వే చేస్తున్నారు. సర్వేయర్‌తో మాట్లాడి త్వరలోనే సర్వే నంబర్ 1429 ఏ, బీలోని 83.64 ఎకరాల భూమిని సబ్ డివిజన్ చేయిస్తా.
>
> – శాంతి, తహసీల్దార్, కొత్తపట్నం

మహిళలకు శాపంలా కూటమి పాలన

- వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోనల్ ప్రెసిడెంట్ గంగసాని లక్ష్మి



మాట్లాడుతున్న ఎంపీపీ గంగసాని లక్ష్మి

పామూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన మహిళల పాలిట శాపంలా మారిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ ప్రెసిడెంట్, పామూరు ఎంపీపీ గంగసాని లక్ష్మి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యంపై కూటమి ప్రభుత్వ నిర్ణయాలు మహిళల జీవితాలను నాశనం చేసేలా ఉన్నాయని ధ్వజమెత్తారు. ఎన్నికల వేళ ఓట్లకోసం మహిళలందరికీ రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా బస్సు ప్రయాణం ఉచితమంటూ హామీ ఇచ్చిన చంద్రబాబు నేడు ఆ పథకం అమలులో షరతులు విధించి కొన్ని బస్సుల్లోనే ఉచితమంటూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఉచితబస్సు పథకం అమలు అయితే ఎంతో మంది పేద మహిళలు తమ సొంత పనులతోపాటు బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి వచ్చేందుకు, రాష్ట్రంలోని ప్రముఖ ప్రముఖ పుణ్యక్షేత్రాలు దర్శించుకునే అవకాశం కలుగుతుందని ఎంతో ఆశపడ్డారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ పథకంపై ఏడాదిగా నాన్చుతూ వచ్చి ఎన్నో కొర్రీలు పెడుతూ చివరకు కొన్ని బస్సు సర్వీస్‌లోనే మహిళలకు ఉచిత ప్రయాణమని ప్రకటించడంతో రాష్ట్రంలోని మహిళలు నిరాశకు గురవుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో బడి, గుడి అన్న తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ మద్యం షాపులు ఏర్పాటు చేయడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చాలా చోట్ల మద్యం బాటిళ్లను అనుమతులు ఉన్న మద్యం దుకాణాల్లో కాకుండా బెల్ట్ దుకాణాలు, రోడ్డుపక్కన దుకాణాల్లో విక్రయిస్తున్నారని దీంతో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో మహిళలపై దాడులు అదే విధంగా మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం తెచ్చిన మద్యం విధానం ద్వారా 2019–24 మధ్య మద్యం అమ్మకాలు గణనీయంగా తగ్గాయని, రాష్ట్రంలో బెల్ట్ దుకాణాలు లేకుండాచేశారని కాగా నేడు దానికి భిన్నంగా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో మద్యాన్ని ఏరులై పారిస్తుందన్నారు. దీనికి తోడు మద్యం దుకాణం పక్కనే పర్మిట్ రూములు ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అవి మద్యపానానికి అడ్డాగా మారతాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తన నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్‌చేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల తరుపున పోరాటం చేస్తామని, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుపోయి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. సమావేశంలో పార్టీ మహిళావిభాగం జిల్లా కార్యదర్శి గాయకవాడ సుహాసిని, పార్టీ పట్టణ అధ్యక్షురాలు ఓరుగంటి పద్మ, పందిటి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో ప్రత్యేక పూజల్లో దద్దాల నారాయణ, పార్టీ నేతలు



శంకుస్థాపన చేస్తున్న దద్దాల, ముక్కు కాశిరెడ్డి దంపతులు

కనిగిరిరూరల్: పట్టణంలోని కొత్తూరులో అభయాంజనేయ స్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అభయాంజనేయ స్వామి కళ్యాణ మండప శంకుస్థాపన పూజల్లో మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి, ఆదిలక్ష్మమ్మ దంపతులు విశిష్ట పూజలు చేశారు. ఈ శంకుస్థాప పూజల్లో వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర దద్దాల నారాయణయాదవ్, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, జెడ్పీటీసీల సంఘ అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, ఒకేరెడ్డి, తమ్మినేని సుజాతరెడ్డి, ఆవుల భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో అలాగే పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, అచ్చాల శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, చింతం శ్రీనివాసులు యాదవ్, కస్నేటి సుబ్బారెడ్డి, శ్రీహరిరెడ్డి, జి.బొర్రారెడ్డి, వాకుమళ్ల రాజశేఖరరెడ్డి, మూలే రాజశేఖరరెడ్డి, కనమర్ల కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే కల్యాణ మండప శంకుస్థాపన పూజల్లో మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి



సువర్చలా అభయాంజనేయస్వామి కల్యాణంలో పాల్గొన్న దంపతులు, వేద పండితులు

ఒంగోలు మెట్రో: స్థానిక మర్రిచెట్టుకాలనీలోని పాలిమేర అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి నవమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాలు, సుగంధ పరిమళ ద్రవ్యాలు, పండ్ల రసాలు అభిషేకం, 108 కలశాలతో అష్టోత్తర కలశాభిషేకం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. స్వామివారికి మంగళహారతులిచ్చి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం స్వామివారి మూలమంత్ర హోమంతో పూర్ణాహుతి జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి ఏడు గంటలకు శ్రీ సువర్చల హనుమత్ కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి అన్నప్రసాదాలు అందజేశారు.

నేడు పీర్లమాన్యం పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు సబర్బన్: నగరంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ డీ–3 ఏఈఈ ఎస్.శివ ప్రసాదు పరిధిలోని పీర్లమాన్యం పరిసర ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాను కొన్ని గంటల పాటు నిలిపివేయనున్నట్లు ఒంగోలు నగర విద్యుత్ శాఖ డీఈఈ కేవీపీ పాండు రంగారావు తెలిపారు. ఆ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. కర్నూలు రోడ్డు ఏరియాల్లో విద్యుత్ లైన్లకు మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. అందుకుగానూ పీర్లమాన్యం, కర్నూల్ రోడ్డు, అరుణోదయ కాలనీ, టీచర్స్ కాలనీ, సమతా నగర్, శ్రీరామ్ కాలనీ, శ్రీకృష్ణనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిధులు చెత్తపాలు

- గ్రామాల్లో నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు
- పల్లెల్లో కన్పించని చెత్త సేకరణ
- శ్రమకు తగ్గ ఫలితం లేక అల్లాడుతున్న గ్రీన్ అంబాసిడర్‌లు
- ఫొటోలకు ఫోజులిచ్చి మమ అని పిస్తున్న మండలస్థాయి అధికారులు
- మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన వైనం



చెత్త సంపద కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

కనిగిరిరూరల్: అధికారుల నిర్లక్ష్యంతో లక్షల రూపాయల ప్రజాధనం చెత్త పాలవుతోంది. ఎన్నో ఏళ్ల క్రితం లక్షల రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలే ఇందుకు నిదర్శనం. దాదాపు గ్రామాల్లో చెత్త సంపద కేందాలు ఉత్త కేంద్రాలుగా మారాయి. చెత్తతో వర్మీ కంపోస్ట్ తయారు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం అందించాలనే ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాలు ప్రణాళికా లోపం, శ్రమకు తగ్గ ఫలితం లేక కార్మికుల దూరంగా ఉండటం, అధికారుల నిర్లక్ష్యం వెరసి లక్ష్యానికి దూరంగా మారి చెత్త సంపద కేంద్రాలు అసాంఘిక కార్యకలాపాలకు, మందుబాబులకు నిలయంగా మారాయి. ఒకటి రెండు చోట్ల వినియోగంలో ఉన్నా దాదాపు 90 శాతం అలంకార ప్రాయంగా మారి ప్రభుత్వాల తీరును వెక్కిరిస్తున్నాయి.

అప్పుడప్పుడు.. ఫొటోలకు ఫోజు..

గ్రామాల్లో వచ్చే తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఎరువులను తయారు చేయాలనే ఉద్దేశంతో రూ.లక్షలు ప్రజాధనం వెచ్చించి ఈ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఏళ్లు గడుస్తున్నా అధికారుల నిర్లక్ష్యంతో ఈ కేంద్రాలు ఎందుకు పనికిరాకుండా ఉన్నాయి. మండల స్థాయి అధికారులు అప్పుడప్పుడు ప్రత్యేక కార్యక్రమాలకు గ్రామాలకు వచ్చి.. చెత్త సంపద కేంద్రాల వద్ద నిలబడి ఫొటోలకు ఫోజులిచ్చి మమ అనిపించి చేతులు దులుపుకుంటున్నారు. అంతే కానీ ప్రజాధనం ఉపయోగించి నిర్మించిన వీటిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ఒక్కరంటే ఒక్కరూ కూడా చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా ప్రజాధనం లక్షల్లో చెత్త పాలైంది. రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమం పేరుతో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు గ్రామాల్లో గత ఏడాది ఆగస్టు 12 నుంచి 14వ తేదీ వరకు శిక్షణా తరగతులు నిర్వహించారు. అయినా క్షేత్ర స్థాయిలో అవి లక్ష్యానికి దూరంగా ఉన్నాయి.

ఉన్నా ఉపయోగం సున్నా...

కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 135 పంచాయతీలు ఉన్నాయి. అందులో దాదాపు 75 శాతానికి పైగా చెత్త సంపద కేంద్రాలు నిర్మాణాలను బట్టి రూ.5 నుంచి రూ.10 లక్షలు వెచ్చించి స్వచ్ఛాంధ్ర, తదితర నిధులతో నిర్మించారు. కొన్ని ప్రాంతాల్లో స్థల లేమి, నిధుల కొరత, అధికారుల నిర్లక్ష్యంతో నిర్మాణం కాలేదు. ప్రతి 250 గృహాలకు, 1000 మంది జనాభాకు ఒక గ్రీన్ అంబాసిడర్‌ను నియమించారు. అంటే నియోజకవర్గంలో సుమారు 250 నుంచి 300 మంది వరకు గ్రీన్ అంబాసిడర్‌లు ఉన్నారు. అయితే వీరికి ఇచ్చే జీతానికి వీరు చేసే పనికి శ్రమ దోపిడీకి గురవుతున్నారు. చాల కాలం నుంచి గ్రీన్ అంబాసిడర్లకు రూ.6 నుంచి 10 వేలు మాత్రమే వేతనాలు ఇస్తుడంటంతో చాలా మంది అయిష్టం, అసంతృప్తి, నామ్‌కే వాస్తేగా పనిచేస్తున్నారు. అంతేగాక పంచాయతీకి దూరంగా.. కనీసం రెండు మూడు కిలో మీటర్లు దూరంగా ఉండటంతో గ్రీన్ అంబాసిడర్‌లు చెత్త, సేకరణ, ఆ తర్వాత అంత దూరం తీసుకెళ్లడం, అక్కడ తడి పొడి చెత్త వేరుగా వేసి, ఎరువుగా మార్చడం ఈ ప్రక్రియ అంతా వీరికి తలకు మించిన భారంగా మారింది. శ్రమకు తగ్గ ఫలితం లేకపోవడంతో అనేక ప్రాంతాల్లో తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు. దాదాపు ఎక్కడా ఈ పనులు జరగడం లేదు. కార్మికులు చెత్త సేకరణ చేయడం లేదు. దీంతో చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో ఆ కేంద్రాలు మందు బులకు, అసాంఘిక కార్యకలాపాలకు, పశువులకు ఆవాస కేంద్రాలుగా మారాయి.

చీమకుర్తిలో సేవా కార్యక్రమాలు

చీమకుర్తి: మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పుట్టినరోజును పురస్కరించుకుని ఆదివారం చీమకుర్తిలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేసి కేక్ కట్ చేసిన అనంతరం శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతుల చేతుల మీదుగా మున్సిపల్ వర్కర్లకు యాప్రాన్‌లు, గ్లౌజ్‌లు అందజేశారు. బాషా వృద్ధాశ్రమానికి దుప్పట్లు, బధిరుల పాఠశాలలోని బాలికలకు కాస్మొటిక్స్ అందించారు. ప్రభుత్వ పాఠశాలలోని మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు ఏడాది పాటు వంట గ్యాస్ సరఫరాకు నగదు, విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందించారు. శిద్దా రాఘవరావు కుమారుడు సుధీర్, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఒంగోలులో...

ఒంగోలు సిటీ: స్థానిక తన నివాసంలోనూ కుటుంబ సభ్యులతో కలిసి శిద్దా రాఘవరావు కేక్ కట్‌చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. పలువురు ప్రముఖులు పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



ఒంగోలులో కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేస్తున్న శిద్దా రాఘవరావు



చీమకుర్తిలో మున్సిపల్ వర్కర్లకు యాప్రాన్‌లు అందిస్తున్న శిద్దా రాఘవరావు దంపతులు